కథ

# ఆ ఒక్క రోజే...

- కోరం రాజబాబు

కారులో వెళ్తూ సెల్‌ఫోన్ అందుకున్న వెంటనే సడెన్ బ్రేక్‌వేశాను. కళ్లు మూసుకుని కొన్ని క్షణాలు అలాగే ఉండిపోయాను. గుండెవేగం పెరిగిపోయింది. ప్రక్కనే నిండు గోదావరి ప్రశాంతంగా ప్రవహిస్తుంటే... కారు దిగి ఒడ్డుకు వెళ్లి నుంచున్నాను. గోదావరిపై కట్టిన రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి దగ్గరగా కన్పిస్తోంది. సరిగ్గా నెలరోజుల క్రితం... గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వైజాగ్ వస్తున్నాను. హైదరాబాద్ నుండి నువ్వెలా వస్తున్నావ్ అంటూ నన్నడిగాడు సత్య. ఒకరోజు ముందుగానే బయలుదేరుతున్న విషయాన్ని సత్యకు చెప్పి... మనం యూనివర్సిటీ మిలీనియం బ్లాక్ కాన్ఫరెన్స్‌హాలులో కలుద్దాం అన్నాను. ఆ క్షణం కోసం ఎదురు చూస్తానంటూ ఫోన్ పెట్టేశాడు సత్య.

★★★

బరువెక్కిన గుండెతో అక్కడి నుండి కదిలాను. సత్య ఇకలేడన్న నిజాన్ని ఎందుకో నమ్మలేక పోతున్నాను. వైజాగ్ నుండి హైదరాబాద్ తిరిగొచ్చిన నెల తర్వాత పనిమీద రాజమండ్రి వెళ్లాను నేను. అదేరోజు రాజమండ్రి నుండి హైదరాబాద్‌కు నా ప్రయాణం. కాసేపట్లో నేను గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కాల్సి వుండగా వైజాగ్ నుండి ఫోన్. 'మన బ్యాచ్‌లో సత్య చనిపోయాడు. అతన్ని మనమందరం మిస్సయ్యాం' అవతలి గొంతులో బాధ. అతనితో పంచుకున్న అనుభవాలు ఒక్కొక్కటీ గుండెల్ని తాకుతున్నాయి. అభిమానంగా అతను చూసిన చూపు నా గుండెను ఆక్రమించేసింది. అప్రయత్నంగా నా కళ్లు చెమ్మగిల్లాయి. సత్య మమ్మల్ని కలవకున్నా బాగుండేది. ఇరవై అయిదేళ్ల తర్వాత కలిసిన సత్య ముప్పై రోజులు తర్వాత ఇక లేడని తెలిశాక ఆ వాస్తవాన్ని భరించటం కష్టం. గుండెల్ని ఏదో బరువుగా నొక్కేస్తున్న ఫీలింగ్. పాపం సత్య పిల్లల పరిస్థితేంటి? ఏ ఆధారం లేని వాళ్ల భవిష్యత్‌ను ఎవరు నిర్దేశిస్తారు. ఏం చేయగలం? ఆలోచనలు నన్ను కమ్ముకున్నాయి. అంతలోనే పెద్దశబ్దంతో గోదావరి ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది. ఆలోచనల్ని క్షణం బ్రేక్‌చేసి ట్రైన్ ఎక్కాను. రాజమండ్రిలో ట్రైన్‌ఎక్కిన తర్వాత నా ఆలోచనలు వైజాగ్ వరకూ వెనక్కి పరుగెట్టాయి.

***

అది ఆంధ్రా యూనివర్సిటీ మిలీనియం బ్లాక్ కాన్ఫరెన్సు హాల్. సరిగ్గా ఇరవై అయిదేళ్ల క్రితం యూనివర్శిటీలో పి.జి. సోషల్‌వర్క్ చదివినవాళ్లు ఒక్కొక్కరూ అక్కడికి చేరుకుంటున్నారు. ఆత్మీయ పలకరింపులు, అభిమాన కౌగిలింతలు ఉద్వేగానికి గురి చేశాయి. ఒక్కచోట చదివిన వాళ్లు ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవటం వింతగా, విస్మయంగా అనిపించింది. వివిధ ఉద్యోగాల్లో, ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లు ఒకే చోట... నిజంగా ఆ ప్రాంగణమంతా సంతోషమే. నేనున్నానంటూ సముద్రం మీదుగా వచ్చే చల్లని గాలి రివ్వున తాకుతుంటే ఆ అనుభూతిని వర్ణించటం కష్టం. పీజీ చదివిన రెండేళ్ల జీవితం కళ్ల ముందు ఒక్కసారిగా ప్రత్యక్షమయ్యేసరికి యూనివర్సిటీలో ప్రతి అంగుళం మా ఆలోచనలో ఇమిడిపోయింది. మేం చదివిన క్లాస్‌రూంలు, నివసించిన హాస్టళ్లు, అల్లరి చేసిన క్యాంటీన్లు, రోడ్లపైకి గొడుగుల్లా వంగి స్వాగతిస్తున్న పచ్చని చెట్లు నిశ్శబ్దంగా ఆత్మీయతను పంచుతున్నట్లనిపించింది.

కాసేపయ్యాక అందరం కాన్ఫరెన్స్‌హాలులో కూర్చున్నాం. అనుభవాలు ఒక్కొక్కటీ దొర్లుతూ ప్రతి ఒక్కరి గుండెల్ని తాకుతున్నాయి. జీవితంలో రంగుల స్వప్నాలు, దొరికిన విజయాలు, ఎదురుదెబ్బలు... ఒక్కొక్కరిదీ ఒక్కో రకమైన జీవితం. అనుభవాల పందిరిలో అందరం చిక్కుకుపోయాం. కొందరిలో ఇంకా సాధించాలన్న తపన. మరి కొందరిలో సమాజానికి ఏదో చేయాలన్న కోరిక. కొందరిలో ఎలా చేయాలో తెలియని సందిగ్ధత. పిల్లల పెళ్ళిళ్ళుచేసి అత్తారింటికి పంపిన అనుభవాలు కొందరివి. పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవుతున్నారని మురిసిపోతున్న చిరునవ్వులు ఇంకొందరివి. సమయం కూడా తెలియనంతగా ఇలాంటి ఎన్నో ముచ్చట్లలో మునిగిపోయాం.

***

సమయం సాయంత్రం నాలుగయింది. అప్పటి ప్రొఫెసర్స్, లెక్చరర్స్‌తో సమావేశం. గత స్మృతులు నెమ్మదిగా దొర్లుతున్నాయి.. కొందరు రిటైర్ అయి సమాజసేవలో ఉన్నారు. వచ్చిన అధ్యాపకులందరికీ సన్మానం. 'ఇన్నేళ్ల తర్వాత ఈ సన్మానం మా సేవలకు గుర్తుగానేకాదు... ఓ అనుబంధానికి తీపి గుర్తుగా' అన్నారంతా. 'ఎంత అనుభవం ఉన్నా... కొత్తతరం మమ్మల్ని మర్చిపోయింది. ఒకప్పుడు పాఠాలు చెప్పిన ఈ ప్రాంగణం అంతా మమ్మల్ని వెక్కిరిస్తోంది. మీరు గుర్తు చేసుకున్నారు. మమ్మల్ని గుర్తించారు' హాలంతా కొన్నిక్షణాలు నిశ్శబ్ధం. తర్వాత కేక్ కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారంతా. మా బ్యాచ్‌మేట్ అయిన ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, రీడర్ శేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జయశ్రీ కళ్లల్లో సంతృప్తి.... నిజమే మరి... ఇదంతా చేసిందీ... అందర్నీ ఓ చోట చేర్చిందీ వారే.

***


సాయంత్రం ఆరయ్యింది. అధ్యాపకులంతా వెళ్ళిపోయాక మేమంతా మళ్ళీ సమావేశమయ్యాం. మనం సోషల్‌వర్క్ చదివినందుకు సమాజానికి ఏదో ఒకటి చేయాలి. మనమంతా ఒక అసోసియేషన్ స్థాపిద్దాం అంటూ ప్రపోజ్ చేశారు. దాని మీద కాసేపు చర్చ జరిగింది. చివరకు సరే అన్నారంతా. ముందుగా కొంత మనీ కాంట్రిబ్యూట్ చేసి అకౌంట్ ఓపెన్ చేయాలన్న నిర్ణయానికొచ్చాం.

కాసేపటికి మా చర్చ సత్య చుట్టూ తిరిగింది. అందరం బాగున్నాం. జీవితంలో సెటిల్ అయ్యాం. సత్య ఒక్కడు తప్ప. పైగా అతనికి అందరూ ఆడపిల్లలే. పెద్ద చదువు చదివినా జీవితంలో స్థిరపడలేక కొన్ని వ్యసనాలకు బానిసగా మారిన సత్య పట్ల అందరికీ సానుభూతి ఉంది. అందుకే 'ముందుగా కలెక్ట్‌చేసిన డబ్బును సత్య పిల్లల కాలేజ్ ఫీజులకు ఇచ్చేద్దాం. దీన్నే మన ప్రయత్నానికి ఒక విజయంగా భావిద్దాం' అన్నారంతా. అనుకున్న వెంటనే నిర్ణయం జరిగిపోయింది. సత్య అందరికీ కృతజ్ఞతలు చెప్పాడు. చెడు వ్యసనాలు ఇక మానేసి మీ అందరి ప్రోత్సాహంతో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తానని చెప్పాడు. అలా అంటున్నప్పుడు అతని కళ్ళు నుండి నీళ్లు... ఓ మంచి

పనిని ప్రారంభించినందుకు, కొత్త జీవితం వైపు అడుగులేస్తున్నందుకు... దానికి మేమందరం కారణం అయినందుకు మా అందరిలోనూ ఓ గొప్ప ఫీలింగ్. మా బ్యాచ్‌మేట్‌కు ఉపయోగప డుతున్నామన్న తృప్తి. చివరకు ఎన్నో అనుభ వాలు. అనుభూతులతో గుండెల నిండా ఆనం దంతో ఒకరికొకరం వీడ్కోలు చెప్పుకున్నాం.

నేను ప్రయాణిస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ విజ యవాడ చేరుకుంది. సత్య ఆలోచనలతో నిద్రరాక కళ్లు పొడిబారి పోయాయి. నెలరోజుల క్రితం జరి గిన ప్రతి సంఘటనా గుర్తుకొచ్చి మనసు మౌనంగా రోదిస్తోంది. సత్య బాగుండాలని మేమందరం కోరుకున్నాం. సత్య కోసం.... అతని భవిష్యత్‌కోసం ఆలోచించాం. అందుకే అంత బాధ. మేమందరం ఇలా కలవకుండా ఉండా ల్సింది. అప్పుడు సత్య గురించి ఎవ్వరికీ తెలిసుం డేది కాదు. ఒకవేళ తెలిసినా ఆ బాధ తీవ్రత ఇంత ఎక్కువగా ఉండేది కాదు. పాతికేళ్ల తర్వాత కలిశాం. మనస్సు విప్పి ముచ్చటించుకున్నాం. సంతోషాన్ని అనుభవాల్ని పంచుకున్నాం. కేవలం నెల రోజుల వ్యవధిలోనే మా మధ్య అతను లేకుండా పోవటం? మనసెందుకో తట్టుకోలేక పోతోంది.

నా ఆలోచనలు నా ప్రయాణంతో పోటీపడి వేగంగా పరుగెడుతున్నాయి. సరిగ్గా పది రోజుల క్రితం సత్య నాతో ఫోన్‌లో మాట్లాడుతూ.... 'రాజూ మన బ్యాచ్‌లో అంతా మంచిమనసు ఉన్నవాళ్లే. నా పట్ల చూపించిన అభిమానాన్ని నేను మర్చిలేక పోతున్నాను. ఇప్పుడు నా జీవితం నాకే కొత్తగా వుంది. హైదరాబాద్ రావా లను కుంటున్నాను. కొన్ని మెడికల్ చెకప్స్ ఉన్నాయి. మరొక విషయం... నువ్వు పంపించిన ఫొటోలు చూశాను. అప్పుడనిపించింది... వైజాగ్ రాకుండా ఉంటే నేనేం మిస్సయ్యే వాడినో! నిజానికి నా ఆరోగ్యం బాగాలేక రాకూ డదనుకున్నాను. కానీ అందర్నీ చూడాలన్న ఆశ నేను వచ్చేలా చేసింది. నువ్వు తీసిన ఫొటోల్లో నేను చాలా చోట్ల కనిపించాను. నేను పెద్దగా గమనించలేదు గాని... ఇప్పుడు తెలుస్తోంది నువ్వు తీసిన మన బ్యాచ్‌మేట్స్ ఫొటోలు చాలా స్వీట్‌గా ఉన్నాయని! ఇంకా మాట్లాడాలనుంది. అయినా హైదరాబాద్ వచ్చాక నిన్ను తప్పక కలుస్తాగా' అన్నాడు ఎగ్జయిటింగ్‌గా! జరిగిపో యిన ప్రతి సంఘటనా మనసును కుదిపేస్తోంది. 'నేను హైదరాబాద్‌కు తిరిగి వచ్చేముందూ.... నువ్వు రాజమండ్రిలోనే ఉన్నావుగా... సత్య చని పోయాడు. నువ్వు అక్కడ నుండి వెళ్లగలవేమో ప్రయత్నించు' అని చెప్పిన జయశ్రీ మాటలు ఆ క్షణంలో నాకు గుర్తొచ్చాయి. ట్రైన్ ఇంకా విజయవాడ లోనే ఉంది. అర్ధరాత్రి. దిగి వెళ్లగలనా! ఒక వేళ వెళ్ళినా అతని డెడ్‌బాడీని చూసే అవకాశం ఉంటుందా? ఉండే అవకాశం లేదు. అన్నీ పూర్తయ్యే ఉంటాయి. రాజమండ్రిలో ట్రైన్ ఎక్కకుండా భీమ వరం ఏ కార్లోనో వెళ్లి ఉంటే? ఖచ్చితంగా అతన్ని చూసేవాడ్ని. నేను తప్పకుండా హైదరాబాద్ తిరిగి



వెళ్ళాల్సిన ఒత్తిడితో ఆ పని చేయలేకపోయాను. అలా చేయనందుకు నిజానికి సిగ్గుపడాల్సిన దుస్థితి నాది. ఎందుకో తప్పు చేశాననిపించింది. ఆలోచిస్తుంటే క్షణ క్షణానికీ బాధ ఎక్కువవుతోంది. గట్టిగా ఏడ్వాలనిపిం చింది. ఎందుకో లోపల ఉండలేక ఫ్లాట్ ఫాం మీద కొచ్చాను. పక్కనే ఉన్న చల్లని నీటితో ముఖాన్ని కడు క్కుని ట్రైన్ ఎక్కాను.

***

కాసేపటికి నెమ్మదిగా విజయవాడ నుండి రైలు కది లింది. సత్యను చూసే అవకాశం కోల్పోయాను. సరైన నిర్ణయం తీసుకోలేని నా నిస్సహాయతను ఎంత సమ ర్థించుకున్నా ప్రయోజనం శూన్యం. డోర్ దగ్గరకొచ్చి నిలబడ్డాను. రైలు విజయవాడను దాటింది. దుఃఖం తన్నుకొస్తుంటే శూన్యం వైపు చూడటం మినహా ఏమీ చేయలేకపోయాను. సత్యను కలిసిన ఆ ''ఒక్క రోజు'' జ్ఞాపకాలు మాత్రం నాతో ప్రయాణిస్తున్నాయి.

*